క్లుప్తంగా

జ్వరాలపై నిర్లక్ష్యం వద్దు



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న జయశంకర్

పలమనేరు: వర్షాల కారణంగా దోమలు ఎక్కువగా ఉన్నందున జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జ్వరం రాగానే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేసుకోవాలని పలమనేరు సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ సూచించారు. ఆమేరకు కాకాతోపులోని యూపీఎస్సీ ల్యాబ్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఏఎస్‌ఎంలు రోజూ ఇంటింటి సర్వే చేసి జ్వరాలతో ఉన్న వారిని ఆస్పత్రికి తీసుకొచ్చి ల్యాబ్‌లో పరీక్షలు చేయించాలని సూచించారు. ఎం–2 ఫామ్ ఆధారంగా ఎం–3 రిజిస్టర్లను నిర్వహించాలని సూచించారు. పాజిటివ్ కేసుల వివరాలను ఉన్నతాధికారులకు తెలపాలన్నారు.

ఘనంగా అఖిల భారత వారోత్సవాలు



మాట్లాడుతున్న ఆనంద్

కుప్పం: 71వ అఖిల భారత వారోత్సవాలను సింగిల్ విండో కార్యాలయంలో (పీఏసీఎస్) బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ప్రాంగణంలో అఖిల భారత వారోత్సవాల సందర్భంగా సహకార సంఘ ఉద్యోగులు, రైతులతో సమావేశం నిర్వహించారు. సహకార సంఘం ద్వారా రైతులకు చేస్తున్న సేవలను వివరించారు. రైతులకు క్రిమిసంహారక మందులు, బంగారంపై రుణాలు, పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాల మంజూరుపై వివరించారు. జిల్లా సహాయ సహకార శాఖ అధికారి ఆనంద్, మురళీమోహన్, బిల్డింగ్ మెనేజర్ రాము, కుప్పం డీసీసీబీ సీఈఓ రాజేంద్ర పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



సమీక్షిస్తున్న ఎంపీడీఓ బాలాజి

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరు ఎంపీయూపీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎంపీడీఓ బాలాజీ బుధవారం తనిఖీ చేశారు. భోజనం నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనంలో తప్పనిసరిగా నాణ్యత పాటించాలని, వంట చేసే పరిసరాలు, వంట పాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలని భోజన నిర్వాహకులకు సూచించారు. విద్యార్థుల జనన ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ సవరణ గురించి సమీక్షించారు. చివరగా గ్రామంలోని సచివాలయాన్ని పరిశీలించారు. పాఠశాల హెచ్‌ఎం లోకేష్, పీఎస్ సుజాత, ఉపాధ్యాయులు శారదాంబ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పుంగనూరు: పెద్దపంజాణి మండలం చిన్నేపల్లి వద్ద 11 బాటిళ్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని మహ్మద్‌రఫీ అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మహ్మద్‌రఫీ చిన్నేపల్లి బస్టాప్ వద్ద విక్రయించేందుకు పెట్టుకున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పుంగనూరు: పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పట్టణానికి చెందిన వినయ్(29), పెద్దపంజాణికి చెందిన జనార్దన్(24) బైక్‌పై గోకుల్ సర్కిల్ వద్దకు చేరుకున్నారు. వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ ..



కృష్ణమూర్తి(ఫైల్)

బంగారుపాళెం: గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఘటనలో తీవ్రంగా గాయపడిన పంప్ ఆపరేటర్ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని దండువారిపల్లెకు చెందిన కృష్ణమూర్తి(52) జంబువారిపల్లె పంచాయతీలో పంప్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి అతనిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి బంగారుపాళెం–అరగొండ రహదారి కొత్తపల్లె వద్ద అండర్ బ్రిడ్జి సమీపంలో పడేసి వెళ్లిపోయారు. పోలీసులు అతన్ని బంగారుపాళెం ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడ నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టిని మింగేస్తున్న అనకొండలు

చెరువు మట్టితో వ్యాపారం మొదలెట్టి కోట్లు గడిస్తున్నారు కొంతమంది అక్రమ వ్యాపారులు. రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టి తరలిస్తున్నా సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. ఇసుక తరహాలో మట్టి కూడా వేల రూపాయల ధర పలుకుతుండడంతో 'మట్టి అనకొండలకు' ఈ వ్యాపారం సిరులు కురిపిస్తోంది.. దీంతో ఏ చెరువులో చూసినా జేసీబీలు, ట్రాక్టర్లు, టిప్పర్లే దర్శనమిస్తున్నాయి. ఫలితంగా చెరువులు బోరుమంటున్నాయి.

- జేబులు నింపుకుంటున్న పచ్చ అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు



చెరువులోని మట్టిని టిప్పర్లతో తరలిస్తున్న దృశ్యం

గంగవరం: చెరువుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లలో మట్టిని యథేచ్ఛగా తరలిస్తూ చెరువులను కొల్లగొడుతున్నారు. పట్టపగలే చెరువులో మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఓ టీడీపీ పంచాయతీ అధ్యక్షుడు తన పలుకుబడిని అడ్డం పెట్టుకుని హిటాచీ ద్వారా టిప్పర్లలో మట్టిని లోడ్ చేసుకుని పలమనేరు పట్టణ పరిసరాలకు అక్రమంగా రవాణా చేస్తున్న ఉదంతం కళ్లకు కట్టినట్టు ప్రత్యక్షంగా కనిపిస్తోంది. మండలంలో కొత్తపల్లె గ్రామ సమీపంలోని పాలమాకుల చెరువులో 4 రోజులుగా టిప్పర్లతో మట్టి రవాణా చేస్తున్నారు. మండలంలోని ఒక పంచాయతీకి చెందిన టీడీపీ అధ్యక్షుడు చెరువు మట్టి దందాకు పాల్పడి ఇటుక బట్టీలు, రియల్ ఎస్టేట్‌లకు మట్టిని తరలించి లక్షలు దండుకుంటున్నాడనే ఆరోపణలు ఉన్నాయి.

తరిగిపోతున్న మట్టి..ఎండిపోతున్న చెరువులు

మండలంలోని అన్ని చెరువులు అధికార టీడీపీ నాయకుల చెరకు బలవుతున్నాయి. అధికార పార్టీ అండ చూసుకుని మట్టి అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఒకరికొకరు వంతులేసుకుని తామే మట్టి రవాణా సాగించాలి తప్ప మరెవరూ మట్టిని తరలించరాదని దందాగిరి చేస్తున్నారు. తమ వ్యవసాయ భూములకు అవసరమైన చెరువు మట్టిని రైతులు తరలించుకునేందుకు యత్నించినా వారిపై కన్నెర్ర చేస్తున్నారు. తామే మట్టి తరలిస్తామంటూ రాజకీయ అండ ఉన్న నేతలు మట్టి దందా కొనసాగిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అన్ని చెరువుల్లో ఇష్టానుసారంగా మట్టిని తోడుకుపోయి ఎక్కడ అవసరమో అక్కడ అమ్ముకుంటున్నారు. చెరువుల్లో సారవంతమైన మట్టి ఒక టిప్పర్ లోడు ధర రూ.5 వేలు, ట్రాక్టర్ ధర రూ.2 వేలు వరకు విక్రయిస్తున్నారు. ఈ తతంగం అంతా అధికార పార్టీకి చెందిన కొందరు పచ్చ నాయకులే నడిపిస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

అవసరాల నిమిత్తం చెరువుల్లో మట్టి తరలించాలంటే భూగర్భ గనుల శాఖ, ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. దీనివల్ల పంచాయతీలకు, ప్రభుత్వ ఖజానాకు ఆదాయం చేకూరుతుంది. అయితే అధికార పార్టీ నాయకులకు మాత్రం ఇసుక, మట్టి తరలింపునకు ఎవరి అనుమతులు తీసుకోవడం లేదు. కేవలం అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారు. చెరువుల్లో మట్టి తరిగిపోవడం వల్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. అసలే వర్షాలు అంతంత మాత్రంగా చెరువుల్లో చుక్క నీరు లేక పక్క భూముల్లో పంటలు ఎండిపోయి రైతులకు తీరని దుఃఖం మిగులుస్తోంది. అక్రమాలను నియంత్రించాల్సిన అధికారులు అవినీతిపరులతో కుమ్మక్కై చర్యలు ఏమాత్రం తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా మట్టి అనకొండల బారి నుంచి చెరువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ శివకుమార్ వివరణ కోరగా.. ఎక్కడైనా ఇసుక, మట్టి తరలిస్తున్నట్టు తెలిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ అరుణ

బైరెడ్డిపల్లె: గర్భిణులు మంచి పోషకాహారం తీసుకోవడం వలన పుట్టబోయే బిడ్డ ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణ, హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ పేర్కొన్నారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో బుధవారం ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులకు ప్రోత్సహించాలన్నారు.

ఆరుతడి పంటలను పండించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ

గుడుపల్లె: రబీ సీజన్‌లో రైతులు ఆరుతడి పంటలను పండించుకోవాలని వ్యవసాయశాఖ అధికారి నాగరాజు రైతులకు సూచించారు. బుధవారం తలి అగ్రహారం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ బేటప్పనాయుడు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో జెడ్పీ చైర్మన్



నూతన వధూవరులతో జెడ్పీ చైర్మన్

పలమనేరు: పట్టణంలోని మారెమ్మగుడి వీధికి చెందిన బలరాం కుమార్తె హర్షిత వివాహ కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు కొండారెడ్డి, రవి, కోదండరామయ్య, హరీష్, కండల నరేష్ పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు శంకర్రాయలపేట విద్యార్థులు






అజయ్ గంగోత్రి రవీంద్ర అక్షయ

పెద్దపంజాణి: మండలంలోని శంకర్రాయలపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అజయ్ అండర్–17 బాలుర విభాగంలో, బాలికల విభాగంలో గంగోత్రి, 9వ తరగతి చదువుతున్న రవీంద్ర అండర్–14 బాలుర విభాగంలో, బాలికల విభాగంలో అక్షయ చిత్తూరు జిల్లా బాలబాలికల సాఫ్ట్‌బాల్ జట్లకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వేదవతి, పీడీ దొరై బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30వ తేదీ బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని వారు పేర్కొన్నారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టు తరఫున ఆడతారని చెప్పారు.

పంటలపై ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లెలో బుధవారం తెల్లవారుజామున ఏనుగుల గుంపు సురేంద్రనాథరెడ్డి పొలంలో సాగు చేసిన టమాట పంటను తొక్కి నాశనం చేశాయి. పంట చేతికొచ్చే సమయంలో ఇలా ఏనుగులు పొలంపై పడి నాశనం చేయడంతో రైతు తీవ్రంగా నష్టపోయారు. అధికారులు స్పందించి ఏనుగులు పొలాలపైకి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. గంజాయి విక్రయిస్తే వారిపై పీడీ యాక్ట్‌లు పెడతామని హెచ్చరించారు. ఏదైనా ఉంటే 9440796712 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి



చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ

సదుం: ఇంటి పన్ను వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ పార్వతి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సోమల, సదుం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి నాటికి వంద శాతం పన్ను వసూలు లక్ష్యాలను సాధించాలన్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి తాగునీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయించాలన్నారు. తాగునీటి సరఫరా, వీధి దీపాల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని చెత్త సంపద తయారీ కేంద్రాలలో వర్మీకంపోస్టు ఎరువు తయారీ చేసేలా చూడాలన్నారు. మండల కేంద్రంలో నడిగడ్డ మార్గంలో ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో సోమల ఎంపీడీఓ నారాయణ, ఈఓపీఆర్డీలు లక్ష్మీదేవి, వరప్రసాద్, ఈఓ హసీనా పాల్గొన్నారు.

భోజన పథకం అమలుకు డిమాండ్

పుంగనూరు: జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బసవరాజ ప్రభుత్వ కళాశాల వద్ద విద్యార్థులతో కలసి నిరసన తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని కూటమి నేతలు నిలబెట్టుకోవాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నేతలు మన్సూర్, మహేష్, సోము, గణేష్, సుహేల్, దావూద్, చరణ్ పాల్గొన్నారు.

పెద్దారికుంటలో ఫ్యామిలీ డాక్టర్

పెద్దపంజాణి: మండలంలోని పెద్దారికుంట గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపంజాణి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి టి.మురళి వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులకు గురైన రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందించారు. ఏఎన్‌ఎం భారతి, ఆశావర్కర్ నాగమణి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపల్‌పై టీచర్ ఫిర్యాదు

బైరెడ్డిపల్లె: మండలంలోని కమ్మనపల్లె మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ అనిత వేధింపులు భరించలేకపోతున్నా అని అదే పాఠశాలలో పనిచేస్తున్న పీజీటీ ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు ఎస్.కరుణ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయురాలు సక్రమంగా విధులకు హాజరు కాలేదని, విద్యాబోధన కుంటుపడుతోందని విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డీవైఈఓ విచారణ చేపట్టిన విషయం విధితమే. దీంతో పీజీటీ ఇంగ్లిషు ఉపాధ్యాయురాలు బుధవారం బైరెడ్డిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. అనంతరం ఆమె ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్‌గా అనిత చేరినప్పటి నుంచి తనను మానసికంగా వేధిస్తోందని, తక్కువ కులానికి చెందిన వ్యక్తినని ముద్రవేసి చులకన చేస్తోందని వాపోయారు. విద్యార్థుల తల్లితండ్రులు ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా డీవైఈఓను పిలిపించడం జరిగిందన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానన్నారు. విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన టీచర్లే ఇలా ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

ఇళ్ల మధ్య సెల్ టవర్ ఏర్పాటుపై ఫిర్యాదు



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేస్తున్న ముస్లిం మహిళలు

రొంపిచెర్ల: ఇళ్ల మధ్యలో దౌర్జన్యంగా సెల్ టవర్ నిర్మిస్తున్నారని పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి రొంపిచెర్లలోని చిన్నమసీదు వీధికి చెందిన ముస్లిం మహిళలు బుధవారం ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సెల్‌టవర్ నిర్మిస్తే తాము అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని, వెంటనే తగు చర్యలు తీసుకుని నిలిపి వేయించాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సెల్ టవర్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఫిర్యాదు చేసిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు ఉన్నారు.

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు



ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వి.కోట: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారోత్సవాల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నిర్వాహకులు, బహుమతులు, సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. కార్యక్రమానికి హాజరైన బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం నాగమణి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు చిట్టిబాబు, సంధ్యారాణి, గీత, రేష్మ, గ్రంథాలయ సిబ్బంది మొహ్మద్ వహాబ్ పాల్గొన్నారు.

శేషాచలంలోకి తమిళ పుష్పరాజ్‌లు

- గుట్టుగా తరలిస్తున్న ప్రత్యేక ముఠాలు
- రూ.10వేల చొప్పున అడ్వాన్స్, రోజుకు రూ.వెయ్యి కూలి
- పేదలకు ఆశ చూపి స్మగ్లింగ్ ఊబిలోకి..




పలమనేరు పోలీసులకు చిక్కిన ఎర్ర కూలీలు (ఫైల్), వి.కోట మండలంలో ప్రమాదానికి గురైన వాహనంలోని కూలీల సామగ్రి (ఫైల్)

పలమనేరు: తమిళనాడు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా కూలీలు శేషాచలం అడవుల్లోకి ప్రవేశిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మధ్య జిల్లాలో జరిగిన కొన్ని ఘటనల మేరకు తమిళ కూలీల సంచారం అధికమైనట్లు సమాచారం. గతంలో తమిళనాడు నుంచి గోవిందమాలదారులుగా కొందరు శేషాచలంలోకి వస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. తర్వాత వి.కోట వద్ద టెంపోలో వస్తున్న తమిళ కూలీలు పోలీసులను చూసి పరారయ్యారు. తాజాగా పలమనేరు మండలంలోని కాలువపల్లె వద్ద 8మంది ఎర్ర కూలీలను పోలీసులు పట్టుకున్నారు. తమిళనాడులో చెట్లు నరకడంలో చేయి తిరిగిన కూలీలను కొందరు అక్కడి ఏజెంట్లు రహస్యంగా పంపుతున్నట్టు సమాచారం. వీరు పేదరికం కారణంగా ఎర్ర కూలీలుగా మారుతున్నట్టు తెలుస్తోంది. ఇక్కడికొస్తున్న వారిలో ఎక్కువగా గిరిజనులు, విద్యార్థులు కూడా ఉండడం గమనార్హం.

చేయి తిరిగిన పనోళ్లు..!

ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సమీపంలోనే తమిళనాడులోని ధర్మపురి, కృష్ణగిరి, తిరపత్తూర్, వేలూరు, తిరువణ్ణామలై, తిరువళ్లూరు జిల్లాలున్నాయి. ఈ ప్రాంతాల్లోనూ అడవులున్నాయి. అక్కడ సంచరిస్తూ చెట్లను కొట్టడంలో వీరు చేయి తిరిగిన కూలీలు. ఆహారం లేకున్నా రెండు రోజులు పస్తు లుండడం లేదా అడవుల్లో దొరికే పండ్లను సైతం తింటూ ఆకలి తీర్చుకుంటారు. అందుకే శేషాచలంలో ఎర్రదుంగలను నరికేందుకు స్మగ్లర్లు వీరినే పిలిపించుకుంటారు.

నీలగిరి చెట్లను నరికేందుకంటూ....

నీలగిరి చెట్లను నరికే పని కల్పిస్తామంటూ కూలీలకు మాయమాటలు చెప్పి శేషాచలం అడవులకు తీసుకొస్తున్నారు. తీరా ఇక్కడకు వచ్చిన తర్వాత ఎర్రదుంగలు నరికే పనులు అప్పగిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా కొన్ని ముఠాలు పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. పలువురు నిరుద్యోగులు సైతం ఇప్పటికే ఈ ఊబిలోకి దించినట్టు సమాచారం. పూట గడవడమే కష్టంగా ఉన్న కుటుంబాలకు ఆశ చూపి ఇందులోకి దింపుతున్నారు.

ముందస్తు బయానా!

ఎర్రకూలీలకు ముందుగానే ఈ ముఠాలు రూ.10వేల చొప్పున బయానా ఇస్తున్నట్టు తెలిసింది. దీంతో పాటు రోజుకు రూ.వెయ్యి కూలి, బిరియానీ, మద్యం కూడా సరఫరా చేస్తారని తెలుస్తోంది. గతంలో ఈ పనులకు వెళ్ళొచ్చిన కూలీల ఇళ్లల్లో టీవీలు, ఫ్రిజ్‌లను చూసిన మరికొందరు సైతం వీరి బాట పడుతున్నారు. ఈ కూలీల్లో చదువుకుంటున్న వారు, మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులుండడం గమనార్హం.




నెల్లిపట్ల వద్ద కారులో ఎర్రదుంగలు (ఫైల్), తిరువణ్ణామలై అటవీప్రాంతంలో నివసించే గిరిజనుల గుడిసె

కూలీల కోసం ప్రత్యేక ఏజెంట్లు

శేషాచలం అడవుల్లోకి కూలీలను సరఫరా చేసేందుకు పలువురు ఏజెంట్లు ఉన్నట్టు సమాచారం. వీరి ద్వారానే కూలీలు అడవుల్లోకి వెళుతున్నట్టు తెలుస్తోంది. చెట్లను నరకడానికి కావాల్సిన పనిముట్లు, కూలీలను తరలిచేందుకు తప్పుడు ఆర్‌సీలున్న వాహనాలను ఈ ఏజెంట్లే సమకూర్చుతున్నట్టు గతంలోనూ పోలీసుల విచారణలో తేలింది. ఏదేమైనా తమిళనాడు రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రకరకాల మార్గాల్లో చేరి శేషాచలంలోకి ప్రవేశిస్తున్న ఎర్రకూలీల వ్యవహారంపై టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక దృష్టిని సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


నర్సింగ్ విద్య కీలకం



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ క్రిష్టారావు

గుడుపల్లె: సమాజంలో నర్సింగ్ విద్య ఎంతో కీలకమని పీఈఎస్ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్టారావు అన్నారు. బుధవారం పీఈఎస్ కళాశాల ఆవరణలో 20వ బ్యాచ్ బీఎస్సీ నర్సింగ్ కోర్సు మొదటి సంవత్సర తరగతులను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నర్సులు రోగి సంరక్షణ సమయంలో వృత్తి ధర్మాన్ని పాటించాలన్నారు. వైద్యనిపుణులు విశ్వేశ్వరరెడ్డి, అభిరామి, డేనియల్ అరుణకుమార్ పాల్గొన్నారు.

స్కూలు బ్యాగుల వితరణ



కోనేరుకుప్పంలో బ్యాగులు పంపిణీ చేసిన నేతలు, ఆక్విన్ ప్రతినిధులు

శాంతిపురం: బెంగళూరుకు చెందిన ఆక్విన్ ఫైనాన్షియల్ సొల్యూషన్స్ సంస్థ ఆధ్వర్యంలో మూడు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూలు బ్యాగులను వితరణగా అందించారు. మండలంలోని కోనేరుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాల, 121 పెద్దూరు ప్రాథమిక పాఠశాల, గుడుపల్లె మండలంలోని గుత్తార్లపల్లి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం బ్యాగులను పంపిణీ చేశారు. ఆక్విన్ సంస్థ ప్రతినిధి అశ్వత్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు జేఎం కృష్ణమూర్తి, ఎస్.విజయకుమార్ పాల్గొని బ్యాగులను అందజేశారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.